ప్రజాశక్తి

ఆదివారం 24 మార్చి 2024 5 అనంతపురం



స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

రాయదుర్గం : సాధారణ ఎన్నికలకు సంబంధించి రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్ డిస్ట్రిబ్యూషన్, కమిషనింగ్ కేంద్రాలను కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎన్నికలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పిఒ, ఎపిఒల శిక్షణ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ కేంద్రాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బి.కరుణకుమారి, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, తహశీల్దార్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క(ల్తీ)ల్లు..!

ప్రజల ఆరోగ్యాలు ఏమైతే మాకేంటి.. ఎవరు చచ్చిపోతే మాకేం..! అనేలా కొందరు వ్యాపారులు బడుగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. డబ్బు సంపాదనే పరమావధిగా భావించి కల్తీకల్లు కాటుతో జనం జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. అధికారం అండగా యథేచ్ఛగా కల్తీ వ్యాపారాన్ని మూడు చెట్లు 300 సీసాల కల్లు అనేలా కొనసాగిచ్చేస్తున్నారు. కాలకూట విషాన్ని పేదల శరీరాల్లోకి నింపి డబ్బులు దండుకుంటున్నారు. మత్తు పదార్థాలు కలిపిన కల్లు తాగుతూ చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. మరికొందరు మానసికస్థితి కోల్పోతున్నారు. మరణాలూ సంభవిస్తున్నాయి. దీనిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

- హానికర రసాయనాలతో కల్లు తయారీ
- గాల్లో కలుస్తున్న బడుగుల జీవితాలు
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- 3 చెట్లు 300 సీసాలుగా వ్యాపారం
- శాంపిల్స్ సేకరణతో సరిపెడుతున్న ఎక్సైజ్ శాఖ
- ఎన్నికల సమయంలో కల్తీ వ్యాపారం ఎక్కువయ్యే అవకాశం...

అమ్మకానికి తయారు చేస్తున్న కల్లు





ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం జిల్లాలో 258 కల్లు దుకాణాలు (టీఎస్‌లు), శ్రీసత్యసాయి జిల్లాలో 79 టీఎస్టీ(ట్రీ ఫర్ ట్యాపర్), 150 టీసీఎస్ (టాడీ కోఆపరేటివ్ సొసైటీ)లు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 496 దుకాణాలు ఉండగా, అనధికారికంగా మరో వెయ్యి వరకు అదనంగా ఉంటున్నాయి. ఎక్సైజ్ రికార్డుల్లో మూసివేసినట్లుగా ఉన్న దుకాణాల్లోనూ జోరుగా కల్లు విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఏయే దుకాణం పరిధిలో ఎన్ని ఈత చెట్లు ఉన్నాయి..? వాటి నుంచి రోజుకు ఎంత కల్లు ఉత్పత్తి అవుతోంది అనే వివరాలు పక్కాగా ఉండాలి. ఈత చెట్లకు నెంబర్లు కేటాయించాలి. అయితే ఇవేవి ఒక క్రమ పద్ధతిలో జరగడం లేదు. ఎక్సైజ్ అధికారులు కొన్నేళ్ల కిందటి లెక్కల్ని నివేదికలో చూపుతూ కాలం వెల్లదీసేస్తున్నారు.

చెట్లు తక్కువ కల్లు ఎక్కువ..!

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని హిందూపురం, మడకశిర నియోజకవర్గాలను ఎక్సైజ్ శాఖ టాడి హబ్‌గా గుర్తించింది. ఈ ప్రాంతాల్లో ఈతచెట్లు తక్కువగానే ఉన్నాయి. చెట్లు తక్కువగా ఉన్నా కల్లు వ్యాపారం మాత్రం మూడు చెట్లు 300 సీసాలు అన్న చందంగా కొనసాగుతుండడం విశేషం. హిందూపురం ప్రాంతంలో ఈత చెట్టు వనాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎప్పుడో తాతలు, ముత్తాతల కాలంలో ఉన్న ఈతవనాలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. అక్కడక్కడ మాత్రం కొన్ని కనిపిస్తాయి. ఎక్సైజ్ అధికారులకు మాత్రం ఎటుచూసినా ఈతవనాలే కనిపిస్తున్నాయి. ప్రశ్నిస్తే పాత రికార్డులు తెరిచి ఆ గ్రామంలో... ఈ గ్రామంలో ఈత వనాలు ఉన్నాయంటూ 50 సంవత్సరాల నాటి లెక్కలను నేటికీ చూపిస్తూ కాలం గడిపేస్తున్నారు. ఈత చెట్లే లేకపోయినా ఈ ప్రాంతంలో భారీగా కల్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ కల్లు అంతా చెట్లనుంచి వచ్చిన కల్లు అనుకుంటే పొరబడినట్లే. ఈత చెట్ల నుంచి సేకరించేది పదిలీటర్లు అయితే అమ్మేది మాత్రం వందల లీటర్లలో ఉంటోంది.

ఎన్నికల వేళ మరింత అధికం

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల వేడి జిల్లాలో ఉంది. ఈ నేపథ్యంలో మద్యం విక్రయాలు అధికంగా జరుగుతాయి. ఇప్పటికే కర్నాటక మద్యం విచ్చలవిడిగా జిల్లాలోకి వచ్చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మద్యానికి బదులుగా కల్లు ఇచ్చే ఏర్పాటును కూడా ఆయా ప్రాంత నాయకులు చేస్తున్నారు. దీంతో ఎన్నికల నేపథ్యంలో కల్లు అవసరం మరింత పెరగనుంది. కల్లు విక్రయ దారులు కల్తీతో మరింత ఎక్కువ తయారు చేసి సామాన్యుల ఆరోగ్యాన్ని గుల్ల చేసే ప్రమాదం ఉంది.

నమూనాల సేకరణ ఏదీ...?

నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలు తనిఖీ చేయాలి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. అయితే పరిశీలనలకు సంబంధించి నమూనాల ఫలితాలను ఎక్కడా బయటకు వెల్లడించడం లేదు. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం ఎక్సైజ్ అధికారులు హడావుడి చేసి పరీక్షలు చేస్తున్నారు. కల్తీ తేలిన దుకాణాలకు కొంత జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు.





హిందూపురం ప్రాంతంలో కల్లు విక్రయిస్తున్న వ్యాపారులు

రసాయనాలతో కల్లు కల్తీ ఇలా..

10 లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 150 లీటర్ల నీళ్లు కలుపుతారు. నీళ్లు కలపడం వరకు బాగానే ఉన్నా, ఇందులో రసాయనాలు కలపడంతో అసలు ప్రమాదం తాగేవారిని వెంటాడుతోంది. హిందూపురం, మడకశిర, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో డిమాండుకు సరిపడా ఈత చెట్లు లేవు. దీంతో నీటిలో రసాయానాలు కలిపి కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. ఎక్కడికక్కడ రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుని డైజోఫాం, క్లోరో హైడ్రైట్ వంటి నిషేధిత పదార్థాలను కల్లులో కలుపుతున్నట్లు సమాచారం. అమ్మోనియం మిశ్రమ రసాయనాలు, సోడా యాష్, ఈస్ట్, పంటలకు వాడే యూరియా, కొన్ని రకాల పెస్టిసైడ్‌ను కూడా కల్తీకోసం వాడుతున్నారు. కుంకుడు కాయ రసం కూడా వాడుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మిశ్రమాన్ని నీటి తొట్టెలో కలియ తిప్పుతారు. తీపి కోసం శాక్రిన్, నురగ కోసం అమ్మోనియం వంటి రసాయనాలను వాడుతున్నారు. ఉదయం పూట తయారు చేసిన మిశ్రమానికి ఈస్ట్ కలిపి సాయంత్రం వరకు పులియబెడతారు. తర్వాత సీసాల్లో నింపి దుకాణాలకు చేరవేస్తున్నారు.

ఆరోగ్యంపై హానికర ప్రభావం

వ్యాపారులు కల్లు లాంటి తెల్లటి విషాన్ని తయారు చేసి మందుబాబులకు అమ్మేస్తున్నారు. దీనికి అలవాటుపడిన వారు కల్తీ విషాన్ని తాగి క్రమక్రమంగా ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. డైజోఫాం, క్లోరో హైడ్రైట్ కారణంగా నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఆలోచనశక్తి తగ్గి, మతిమరుపు వస్తుంది. కాలేయంపై ప్రభావం చూపుతుంది. విచక్షణ కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు. క్రమేపి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

వ్యాపారుల సిండికేట్


"హిందూపురం ప్రాంతంలో ఓ సొసైటీ యజమానికి 13 దుకాణాలు ఉన్నాయి. రోజుకు 5 వేల నుంచి 8 వేల లీటర్ల కల్లు విక్రయిస్తారు. ఇందులో 80 శాతం కల్తీనే ఉంటోంది. ఈయన ఎక్సైజ్ అధికారులకు ప్రతి నెలా రూ.2 లక్షలు మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ వ్యాపారంలో ఓ ప్రజాప్రతినిధి, మరొకరు అధికార పార్టీ నాయకుడు ఉన్నారు. మరొక వ్యక్తి కల్తీ కల్లు వ్యాపారం చేసుకునేందుకు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి జై కొడుతూ తన పనిని కానిచ్చేస్తున్నాడు. కల్లు వ్యాపారులు సిండికేట్‌గా మారి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి చేరి వారి వ్యాపారాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం.

హైదరాబాద్ నుంచి రసాయనాల దిగుమతి

కల్లులోకి ప్రమాదకరమైన క్లోరైల్, హైడ్రేడ్, డైజోఫామ్ తదితర రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. డైజోఫాం క్లోరోహైడ్రైట్ వంటి హానికర పదార్థాలను హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా గుంతకల్లు, గుత్తి ప్రాంతాలకు తీసుకొచ్చి అక్కడ్నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. క్లోరో హైడ్రేట్ కిలో రూ.35 వేలు, వైజోఫాం కిలో రూ.90 వేలు చొప్పున విక్రయిస్తున్నారని సమాచారం. వీటి సరఫరాకు గుంతకల్లు కేంద్రంగా ప్రత్యేక ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో అల్ట్రాజోలం అనే అత్యంత హానికరమైన మత్తు మందును కూడా కల్లులో వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పోటీకి దూరంగా సీనియర్లు!

ఇద్దరు మాజీ పిసిసిలు పోటీలో లేనట్టే..?




ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లో సీనియర్లుగా ఉన్న నేతలు ఈసారి ఎన్నికలకు దూరంగానే ఉండనున్నట్టు సమాచారం. మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి జిల్లా సీనియర్ నాయకుల్లో ఒకరుగా ఉన్నారు. 1985లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో మడకశిర నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు ఆ తరువాత 1994లో ఓటమి చెందారు. 1999, 2004లో అక్కడి నుంచే గెలుపొంది మంత్రి కూడా అయ్యారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో మడకశిర ఎస్సీకి రిజర్వు కావడంతో ఆయన కళ్యాణదుర్గంకు మారారు. అక్కడి నుంచి గెలుపొంది మంత్రి అయ్యారు. 2012 రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో దెబ్బతింది. ఆ సమయంలోనూ ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. అంతేకాకుండా 2014లో పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2019లోనూ కళ్యాణదుర్గం నుంచి మరోమారు పోటీ చేశారు. ఇలా 1989 నుంచి ఇప్పటి వరకు పోటీలో ఉంటూనే వస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన పోటీకి దూరంగా ఉండే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సిడబ్లుసి సభ్యుడిగా ఉన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల్లో పోటీకి మాత్రం దూరంగా ఉండాలని భావిస్తున్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఇక మరో సీనియర్ నాయకుడు జెసి.దివాకర్‌రెడ్డి 2019 ఎన్నికల నుంచే పోటీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన కూడా 1983 నుంచి రాజకీయల్లో ఉంటూ వచ్చారు. ఓటమన్నది ఎరుగకుండా ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలుస్తూ వచ్చారు. వయోభారంతోపాటు, తన కుమారుడి రాజకీయరంగ ప్రవేశం చేయించాలన్న ఉద్దేశంతో 2019లో పోటీ చేయలేదు. ఆ తరువాత కొంతకాలం రాజకీయ అంశాలపై మాట్లాడుతూ వచ్చినా గడిచిన రెండేళ్లుగా పూర్తిగా ఎన్నికలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. జిల్లాలో మరో ముఖ్యమైన నాయకుల్లో డాక్టర్ సాకే శైలజనాథ్ ఒకరు. 2004లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికలతోపాటు 2009లోనూ శింగనమల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి కూడా అయ్యారు. రఘువీరారెడ్డి తరువాత ఆయన పిసిసి బాధ్యతలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో ఆయన శింగనమల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈయన కూడా ఈసారి ఎన్నికల బరిలో దిగే ఆలోచన లేనట్టు తెలుస్తోంది. ఇలా జిల్లాలో ముఖ్యమైన నాయకులుగా చెలామణి అయిన నేతలు ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

పాఠశాలల్లో ఇంకా నేల చదువులా..!

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్
- జిల్లాలో సుడిగాలి పర్యటన



అనంతపురం కెఎస్ఆర్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయునితో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యాభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తున్నా ఇంకా విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకోవడం ఏమిటంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. శనివారం నాడు ఆయన జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాలకు వెళ్లి పది పరీక్ష కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించారు. అనంతపురం, రాప్తాడు, బుక్కరాయ సముద్రం మండలాల్లో పర్యటించారు. ఉదయం అనంతపురం పట్టణంలో శారదనగర్ ప్రైమరీ స్కూల్, అంగన్వాడి కేంద్రం, వైఎస్ఆర్ గర్ల్స్ హై స్కూల్, రాప్తాడులోని అంధ విద్యార్థుల పాఠశాల, మోడల్ స్కూల్, బుక్కరాయ సముద్రం హైస్కూల్, ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రాలను చేశారు. కెఎస్ఆర్ గర్ల్స్ హైస్కూల్ తరగతి గదిలో విద్యార్థినులు నేలపై కూర్చుని ఉండడాన్ని చూసి ఆయన విస్మయం వ్యక్తం చేశారు. విద్య కోసం ఇంత ఖర్చు చేస్తున్నా ఇంకా నేలపై విద్యార్థులు ఎందుకు చదువుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందోనన్నారు. దీనిపై ఎస్ఎస్ఎ పిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యాబోధన కోసం ఏర్పాటు చేసిన సాంకేతిక సామగ్రిని మూలనపడేయడం ఏమిటన్నారు. రాప్తాడు మండల కేంద్రంలో అంధ విద్యార్థుల పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే ఎంపీడీవో కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. అనంతరం రాప్తాడు మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రం తనిఖీ చేసి అక్కడి ఏర్పాట్లపై అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి

కమిషనర్ వై.మేఘస్వరూప్



సచివాలయ ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ అనుమతినిచ్చిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరగాలని అలా కాకుండా చేసే నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులను కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ టౌన్ ప్లానర్స్‌తో శనివారం నాడు కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలన్నారు. నిబంధనలు ఉల్లంఘన చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌టిపిలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్ధేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలన్నారు. లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయాలన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పరిశీలన చేయాలని సూచించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబందించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎసిపి మారుతి, హరి ప్రసాద్, టిపిఒ శిరీష, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ దుర్గాంజలితో పాటు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



హమాలీ బోర్డును ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అసంఘటిత కార్మికులు ఏకం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు అసంఘటిత కార్మికులు ఏకం కావాలని సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి, కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని దేవగిరి గ్రామంలో అంబేద్కర్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ అసంఘటిత కార్మికులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్రిటీష్ పాలకులతో పోట్లాడి సాధించిన 40 చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పన్నుల భారం మోపుతూ మతం పేరుతో ప్రజలను విభజించి పాలించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఆయా విధానాలను వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను నివారించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణానికి చెందిన పివిఆర్ పాఠశాల ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలను నిలుపుదల చేసి పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం పూర్తి కాకమునుపే పివిఆర్ పాఠశాల యాజమాన్యం ఇప్పటికే రాయదుర్గంతోపాటు పరిసర గ్రామాల్లో ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు చేపట్టిందన్నారు. పాఠశాల సిబ్బంది ఇప్పటికే రాయదుర్గం, గుమ్మగట్ట మండలాల్లో గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల వివరాలు సేకరిస్తూ అడ్మిషన్ చేయించుకోవాలని ప్రచారం చేస్తున్నారన్నారు. అంతేగాక వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో పాఠశాలలో అడ్మిషన్ల ప్రచారాన్ని కొనసాగిస్తోందన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ విధమైన ప్రచారం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలను నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో పాఠశాల ముందు పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘస్వరూప్

పారిశుధ్య కార్మికులు, సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని విద్యుత్ నగర్, ఆదర్శనగర్, శారదానగర్, ఆర్‌టిఒ కార్యాలయం, జెఎన్‌టియు రోడ్డు, విజయనగర కాలనీ, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్యం పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ప్రదేశాల్లో పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. ప్రధాన రహదారులు, రోడ్లపై చెత్త కనిపించకూడదన్నారు. ముఖ్యంగా హమాలీ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో ఎక్కువ చెత్త ఉందన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఎక్కడైనా సరే పారిశుధ్యం లోపించినా, అపరిశుభ్రంగా ఉన్నా వెంటనే నగరపాలక పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బందికి ప్రజలు వెంటనే సమాచారం అందించాలని కోరారు.

'పది' పరీక్షకు 3,044 మంది గైర్హాజరు : డిఇఒ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో నిర్వహించిన పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 3044 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. 36,387 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3,044 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను డిఇఒ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరీక్షల తీరును క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. డిఇఒ పరీక్షల విభాగం ఏసీ గోవిందనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

భగత్‌సింగ్ ఆశయ సాధనలో యువత నడవాలి - వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం నగర న్యూటౌన్ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు అధ్యక్షతన శనివారం నగరంలోని టీవీ టవర్ వెనుక ఉన్న కొత్త కాలనీలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, బట్ట, తిండి దక్కాలంటే బ్రిటిష్ పాలన నుంచి దేశ విముక్తి కావాలని భగత్‌సింగ్ ఉద్యమించారని తెలిపారు. తన ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్య్రం సాధించారన్నారు. అయితే నేటికీ ఆయన ఆశించిన లక్ష్యాలు పూర్తి కాలేదన్నారు. ఇంటి స్థలాల కోసం నేటికీ పేదలు ఆందోళనలు చేస్తుంటే, రాజకీయ అండ ఉన్న వారు కబ్జాలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులు, డ్రగ్స్ మాఫియా కమ్మేశాయన్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులు యువకులు భగత్‌సింగ్ స్ఫూర్తితో వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అలాగే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దేశ విముక్తి కోసం ఆనాడు భగత్‌సింగ్ అనేక సామాన్యులను పోరాటం నిర్మాణం చేయాలని గుర్తు చేశారు. వారి త్యాగంతో దేశానికి విముక్తి లభించిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఎన్నికల బాండ్ల విధానాన్ని బిజెపి తెచ్చిందన్నారు. వేల కోట్ల నల్లధనాన్ని అధికార బిజెపి ఖాతాలోకి మార్చుకుని, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టారని మండిపడ్డారు. పాలకులు కూడా వారికి తొత్తులుగా మారి దేశాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. మరోవైపు డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా విస్తరిస్తుండటం ఆందోళనకరం అన్నారు. దీని వల్ల రాబోయే తరాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. విశాఖ పోర్టులో దొరికిన డ్రగ్స్ మార్కెట్లోకి వెళితే ఎన్నో తరాల్లో యువత పూర్తిగా పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకునేందుకు యువత ముందుకు రావాలని, కార్పొరేట్‌శక్తుల దోపిడీని ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మనోహర్, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత మాట్లాడుతూ వలస బ్రిటిష్ పాలకుల దాస్య శృంఖలాల నుంచి భారతదేశ విముక్తి కోసం 23 సంవత్సరాల వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. నేడు ప్రతి విద్యార్థి, యువకులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి రావిపల్లి సూర్యప్రకాష్, రజిత, చంద్రకాంత్, వీర శంకర్, గణేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : అలాగే పిడిఎస్‌యు, ఎస్‌ఎస్‌బిఎన్ కళాశాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గురు సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ జక్కంత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు భగత్‌సింగ్ అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ నాయకులు శివ, మధు, జ్యోతిర్మయి, ఉంతేశ, గేళ్ళ, నీలకంఠ, క్రీస్తుబాబు, అభిలాష, ఆదిశేషు, పుష్ప, మనోజ్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : విప్లవవీరుడు భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శామ్యూల్, నారాయణరెడ్డి, షేక్షావలి, నారాయణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : స్వాతంత్రోద్యమ పోరాటంలో ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ అని రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని పెద్దపొలమడ గ్రామంలో చిత్రపటానికి పూలమాల వేసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీరుల బలిదానాలతో సాధించుకున్న దేశంలో ప్రస్తుతం కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద పొలమడ రైతులు నాగరాజు, సాయి, నవీన్, గోవర్ధన, భాను, మోహన్, హరి, దుబ్బన్న, లచ్చి, పెద్ద ఫకీర్, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని డివైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సురేంద్ర, ప్రతాప్, మారుతీప్రసాద్, రమేష్, సునీల్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ వరుణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం 1931 మార్చి 23న ఉరి తీసిందన్నారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో యువత, ప్రజలను భాగస్వామ్యం చేయడంలో వారి పాత్ర కీలకంగా మారిందన్నారు. వీరి స్ఫూర్తితోనే కడప ఉక్కు కర్మాగారం, విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, అందరికీ విద్య-అందరికీ ఉపాధి కోసం యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిరంజీవి, శ్యామ్, నాయకులు రామునాయక్, షాషావలి, రాము, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, జిల్లా అధ్యక్షులు భీమేష్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం వజ్రకరూరు, ఉరవకొండ మండల కేంద్రాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు విద్యార్థులు, యువకులు ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా దేశంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అరాచకాలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుధాకర్, జన విజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జునస్వామి, ఎంఆర్‌పిఎస్ నాయకులు రవి, ఆర్‌ఎస్‌యు నాయకులు పవన్, సాయి, హేమసాగర్, రామ్‌చరణ్, మనోజ్‌కుమార్, రైతుసంఘం, హమాలీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



గుత్తిలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

టిడిపి ఎన్నికల ప్రచారం

పుట్లూరు : మండలంలోని రామలింగాయపల్లి, వెల్లేపల్లి గ్రామంలో టిడిపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రవీంద్రనాయుడు, మాజీ ఉపసర్పంచి చిన్న గురుస్వామి, నాయకులు తిరుపతినాయుడు, నాగేంద్ర, నారాయణస్వామి, హర్షవర్ధన్ నాయుడు, వైకుంఠం సాయి, వార్డు సభ్యులు బాలన్న, లక్ష్మీనారాయణ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఒ

నార్పల : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ భారతి సూచించారు. శనివారం మండల పరిధిలోని నడిమిదొడ్డి-1 అంగన్వాడీ సెంటర్‌లో పోష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల పూర్తయిన వెంటనే అదనపు ఆహారం మొదలు పెట్టాలని సూచించారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలన్నారు. చిన్నారి పెరుగుదల పర్యవేక్షణలో భాగంగా ఎత్తు, బరువు క్రమం తప్పకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, కళావతి, రామాంజమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

'సాయివిజ్ఞాన్'లో హోలీ సంబరాలు

అనంతపురం : నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో శనివారం హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు బాబు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు లావణ్యారామ్ హోళీ పండుగ విశిష్టతను వివరించారు. హోళీ అంటేనే రంగుల పండుగ అన్నారు. దేశంలోని అతి ముఖ్యమైన పండుగ హోళీ అన్నారు. అలాంటి పండుగను అందరం కలిసి చేసుకుందామని పిలుపునిచ్చారు.

పలువురు టిడిపిలో చేరిక

పుట్లూరు : మండల పరిధిలోని గరువుచింతలపల్లి గ్రామానికి చెందిన 35 యాదవ కుటుంబాలు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి వారికి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాయపాటి నారాయణస్వామి, పెద్ద వీరనారప్ప, నవీన్, ఓబులేష్,, గంగాధర్, కె.గంగాధర్, కిట్ట, రంగనాథ్, నారాయణ, దామోదర, గంగాధర, గోవర్ధన, శివశంకర్, రామాంజనేయులు, పార్వతయ్య, చెవ్వ కులశేఖర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, రామచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ఆత్మకూరు : మండల పరిధిలోని ముట్టాల గ్రామంలో ఉన్న మైట్ ఆసుపత్రిలో వ్యవస్థాపకులు డాక్టర్ మామిళ్ల ప్రభాకరరెడ్డి జ్ఞాపకార్థం శనివారం ఉచిత మెగా ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు ఎం.ప్రశాంతి, శ్రావ్యారెడ్డి, భాగ్య, అశోక్‌వర్ధన్, ఇందు, వినయ్ దాదాపు 300 మందికి పైగా వైద్య చికిత్స చేసినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వైద్యనాథ్, హిమాలయ, డాబర్, ఉన్ జా ఏబీఎన్, గ్రీన్ రెమెడీస్ కంపెనీలు సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు అర్జున్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉప కారాగారం వద్ద జైలు సూపరింటెండెంట్ వడ్డే మహేశ్వరుడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వేశ్వర ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి వి.దీప్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి విష్ణుమూర్తి, సబ్ రిజిస్ట్రార్ గురునాథ్, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపకులు సి. విజయభాస్కర్, న్యాయవాది వాసా గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ సాదిక్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది జాకీర్, అల్లా బకాష్, డాక్యుమెంట్ రైటర్లు బండి సత్య, రంగస్వామి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన క్యాంపస్ సెలక్షన్లలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన ఎక్స్‌ఎల్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్న విద్యార్థులు ఐదుగురు ఉద్యోగాలగు ఎంపికయ్యారు. వీరంతా కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా బాధ్యతలు నిర్వహిస్తారని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ జయవర్మ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురయ, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, తదితరులు అభినందించారు.

'బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ'

పెద్దపప్పూరు : టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవుని ఉప్పలపాడు, రెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అభివృద్ధి బాట పట్టాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఎవరికి టికెట్ ఇచ్చినా విజయానికి కృషి చేస్తా

ఉరవకొండ : కాంగ్రెస్ పార్టీ పెద్దల నిర్ణయం మేరకు ఉరవకొండ టికెట్ ఎవరికి కేటాయించినా విజయం కోసం తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం ఉందన్నారు. కావున కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేసి అధిష్టానం ఆదేశాల ప్రకారం ఎవరికి టికెట్ కేటాయించినా గెలుపు కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బోయ ఓబులేసు, వజ్రకరూరు మండల కన్వీనర్ పందికుంట శ్రీకాంత్‌వర్మ, విడపనకల్లు మండల కన్వీనర్ చెట్ల రాముడు, రామాంజనేయులు, కుమారస్వామి. తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మండల ఇన్‌ఛార్జి బాలాజీ, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, జయరామ్ కాలనీ, కుర్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అంతేగాకుండా వివిధ రకాల పన్నులు పెంచుతూ పేదల నడ్డి విరిచిందన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి పరిటాల సునీతమ్మను, చంద్రబాబును గెలిపించాలని కోరారు. అనంతరం వైసిపికి చెందిన బి.శ్రీనివాసులు, శోభారాణి, వెంకటేశ్వర్లు, వనిత, తలారి ఆనంద్, తలారి లక్ష్మి, తలారి వన్నూరుస్వామి, సునీత, సాకే జనార్ధన్, తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోరి దిండ్ల అనిల్‌చౌదరి, గడిపూడి నారాయణస్వామి, నాగేంద్ర, శశాంక్‌చౌదరి, సుబర హరికుమార్, పరుశురాం, కుళ్లాయప్ప, మారెక్క, మనోరంజని, వేణుగోపాల్, కృష్ణమోహన్‌చౌదరి, వెంకటనారాయణ, సూర్యనారాయణ, అంకె ఆనంద్, రవీంద్రారెడ్డి, బాల ఉజ్జనప్ప, బొమ్మయ్య, ఓబళపతి, వెంకటేష్, బెస్త తిమ్మరాయుడు, శ్రీనివాసరెడ్డి, నరసింహులు, మంగళ ఆనంద్, చికెన్ వల్లి, గోపీ, లక్ష్మీదేవమ్మ, చెన్నమ్మ, అలివేలమ్మ, కగ్రావుల మంజుల, ఉషమ్మ, రవితేజారెడ్డి, రాము, రామదాసు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వీరాంజనేయులు, శంకరనారాయణ



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎం. వీరాంజనేయులు, శంకరనారాయణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వీరాంజనేయులు, శంకరనారాయణ అన్నారు. శనివారం మండలంలోని నీలంపల్లి, పాతచెదుళ్ల, కొత్త చెదుళ్ల, రోటరీపురం గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నీలంపల్లి గ్రామంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచిన వైసిపిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకుని జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకులు రమేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, జడ్పిటిసి భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, నాయకులు ఆలూరు రమణారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, వెంకట శివారెడ్డి, ఎంపిటిసి భయపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మడకశిర చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన సిఎం జగన్

ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరాసానాయుడు విమర్శించారు. శనివారం మండలంలోని బొమ్మకుంటపల్లి గ్రామంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అసమర్థత వల్ల అప్పులపాలై రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కావున రాష్ట్రం మళ్లీ తిరిగి అభివృద్ధి బాట పట్టాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపోతే వైసిపి ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ కేవలం డబ్బులు ఉన్నవారికే తెలుగుదేశం పార్టీ టికెట్లు కేటాయించిందని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. దేశంలోనే సామాన్యుడు, జర్నలిస్టులను ఎమ్మెల్యే, ఎంపీలను చేసిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. కావున వెంటనే శంకరనారాయణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, జనసేన రామకృష్ణ, పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, అలం నాగార్జుననాయుడు, ఆదినారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎర్రిస్వామి, బాబయ్య, షరీఫ్, గుత్తానాయుడు, పప్పూరు సత్తి, సుధాకర్, సంజీవ, లక్ష్మీనాయుడు, చంద్రబాబు, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

కమ్యూనిటీ డెవలప్‌మెంట్ రాష్ట్ర సెక్రటరీ ఎంఎల్ఎస్.దేవకుమార్



దేవకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం : జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రతి విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎంఎల్ఎస్.దేవకుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెఎన్‌టియు ఆడిటోరియంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు చెందిన 113 మంది ప్రోగ్రాం ఆఫీసర్లకు ప్రణాళిక శిక్షణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈఏడాదికి చేయాల్సిన కార్యకలాపాలు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రాముఖ్యత, ఉద్దేశాలు, లక్ష్యాల గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు ఆచార్యులు కె.రమణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎస్.శారద, అనంతపురం, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 105 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని 3వ సచివాలయాన్ని ఎంపిడిఒ రాముడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ముగ్గురు ఉద్యోగులు మాత్రమే ఉండడంతో మిగిలినవారు ఎక్కడికెళ్లారని తోటి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన వారు ఆన్ డ్యూటీలో విధుల నిమిత్తం వెళ్లినట్లు తెలపగా మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఇందులో ఎక్కడికి వెళ్తున్నామనే విషయాన్ని విధుల మీద వెళ్లిన ఉద్యోగులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరూ సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆన్ డ్యూటీలో వెళ్తే కచ్చితంగా మూమెంట్ రిజిష్టర్‌లో ఎక్కడికి వెళ్తున్నారో స్పష్టంగా నమోదు చేసి వెళ్లాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాముడు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పుట్లూరు : రేషన్ దుకాణాల డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని తహశీల్దార్ మల్లికార్జునస్వామి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండి వాహనదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీలర్లు, ఎండీ వాహనదారులు రాజకీయ పార్టీల తరపున ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. ఒకవేళ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒ దస్తగిరి మాట్లాడుతూ రేషన్ ఇస్తున్న సమయంలో ఇళ్ల వద్ద ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు, కరపత్రాలు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిష్టప్ప, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరులో మాట్లాడుతున్న తహశీల్దార్ మల్లికార్జునస్వామి

పెద్దవడుగూరు : ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చౌకధాన్యం డీలర్లు, ఎండియు ఆపరేటర్లు తప్పకుండా ఎన్నికల నిబంధనలను పాటించాలని తహశీల్దార్ శేషారామ్‌సింగ్ సూచించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉన్నందున వాటిని అతిక్రమించి ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. ఎవరైనా పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:GOOTY
S.O.P. No. 01/2024

BETWEEN:-

Siddireddy Padmavathi died by her LRS
1].Valasani Rangaswamy,
2] Beldari Padmavathi
3]Valasani Srinivasulu
4]Valasani Ravikumar ...Petitioners

AND

NIL ...Respondents

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై అర్జీదారురాలు తన యొక్క సోదరి SIDDIREDDY PADMAVATHI మరణించినందున ఆమెకు ANDHRA PRAGATHI GRAMEENA BANK, BSNL COMPLEX, ANANTHAPURAMU నందు రావలసిన Fixed Deposit రశీదు నెం.002360 మరియు Fixed Deposit నెం.91031454098 ద్వారా రావలసిన రూ.1,92,519/-(రూపాయలు ఒక లక్ష తొంభై రెండు వేల ఐదు వందల పంతొమ్మిది) లకు వారే వారసులమని మరియు Succession Certificate ను మంజూరు చేయవలయునని పై కోర్టులో అర్జీని దాఖలు చేసినారు.సదరు కోర్టువారు S.O.P. No. 01/2024 తేది మరియు 16/04/2024కు వాయిదా వేసినారు. కావున ఎవరికైన సదరు అర్జీ పై ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో 16/04/2024 వ తేది హాజరై తెలుపుకొనవలయును.

(By order of the Court)
R.V.CHALAPATHI,
Advocates for the Petitioners

సమాయత్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడటంతో అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికార యంత్రాంగం ఎన్నికలకు సమయత్తమవుతున్నాయి. నాలుగో విడతలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 18న నోటిఫికేసన్ విడుదల చేసే విధంగా ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చింది. నాలుగో విడతకు ఎన్నికలు వెళ్లడంతో రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగానికి సమయం కలిసొచ్చింది. వచ్చే నెల వరకూ గడువు ఉండటంతో అన్నిరకాల ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే వైసిపి అన్నిస్థానాలకూ అభ్యర్థులను ప్రకటించడంతో వారందరూ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అసంతృప్తులు ఎక్కడైనా ఉంటే వాటిని చల్లార్చుకుంటున్నారు. ప్రచారాల కోసం గ్రామ గ్రామానికీ తిరిగే పనులు చేపట్టారు. ప్రతిపక్ష టిడిపి కూడా ఇదే తరహాలో ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే ఇంకా అభ్యర్థుల ఖరారు పూర్తి కాలేదు. మూడు జాబితాలు విడుదల చేసినా అనంతపురం పార్లమెంటు, గుంతకల్లు, అనంతపురం అసెంబ్లీలు అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎవరిని బరిలో దింపనుందో చూడాల్సి ఉంది. మరోవైపు కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా వేదికగా ఎన్నికలకు సమయత్తమవుతున్నాయి. ఇంకా అభ్యర్థులను వీరు ప్రకటించలేదు. త్వరలోనే ప్రకటించే అవకాశముంది. ఈ రకంగా ఈ ఎన్నికలు ఇప్పుడున్న వరకూ చూస్తే త్రిముఖ పోరు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయం ఆసన్నమవుతుండటంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. అధికార వైసిపి నాయకులు బాగేపల్లిలో వాచ్‌లతో పట్టుబడటం గమనార్హం. ఇవి ఓటర్లను ప్రతోభ పెట్టేందుకే తీసుకెళుతున్నట్టు గుర్తించి బాగేపల్లి పల్లిలో కేసు నమోదు చేసియున్నారు. అయితే ఇది తీసుకెళ్తున్నది నాయకుడి గన్‌మెన్ కావడం, ఆయనపైనే కేసు నమోదు చేయడం విశేషం. ఇదేవిధంగా కొంత మంది వలంటీర్లు నాయకుల వెంట ప్రచారంలో పాల్గొన్న వారిపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఎవరు గీతదాటినా ఉద్యోగులపై వేటు తప్పదన్న హెచ్చరికలను ఎన్నికల సంఘం ఇప్పటికే జారీ చేసింది. రాజకీయపరమైన ప్రకటనలు చేసినా చర్యలుంటాయని చెబుతోంది. ఇదే సమయంలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఓటర్ల నమోదు కొనసాగుతోంది. ఇవిఎం మిషన్ల ఏర్పాట్లు పోలింగు కేంద్రాల్లో ఏర్పాట్లు, కౌంటింగు కేంద్రాల్లోనూ ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. పోలీసులు పహారాను ముమ్మరం చేశారు. సమస్యాత్మకం అనుకున్న గ్రామాల్లో పోలీసు కవాతులు కొనసాగుతున్నాయి. మార్చి ఆఖరు వచ్చే సరికి వేసవితాపం క్రమక్రమంగా పెరుగుతోంది. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ఎన్నికల సమయం కూడా కావడంతో దాహార్తిని తీర్చేందుకు నేతలు ట్యాంకర్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

డాక్టర్ చింతపర్తి చంద్రయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

దేశంలోని దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని డాక్టర్ చింతపర్తి చంద్రయ్య, ఎస్‌కెయు ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం అన్నారు. శనివారం ఉరవకొండంలోని జోగప్ప కట్ట వీధిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతకు అంబేద్కర్ జీవన విధానం తెలియాన్నారు. అంబేద్కర్ తన కుటుంబాన్ని సైతం లెక్కజేయకుండా దేశంలో అన్నివర్గాల ప్రజలతో పాటు దళితులు వారి కుటుంబాల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక వ్యక్తి అంబేద్కర్ అని కొనియదారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత గంగోల రాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తమ్మన్న, అనంత ఎర్ర సితార అదినారాయణ, దళిత నాయకులు మీనుగ గోపాల్, లత్తవరం చంద్రశేఖర్, అంకె తిప్పేస్వామి, కూడేరు లక్ష్మన్న, రేణుమాకపల్లి రమేష్, వ్యాసాపురం మహేష్, చాబాల సర్పంచి జగదీష్, కరూరు బాల రామాంజనేయులు, విడపనకల్లు చెన్నరాయుడు, పెద్ద ముష్టూరు మధుబాబు, వెలుగొండ బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు